క్లుప్తంగా

మండల కేంద్రాల్లో రైల్వే హెల్ప్‌లైన్‌లు

మద్దిపాడు/నాగులుప్పలపాడు: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఒడిశాలో ప్రమాదానికి గురవడంతో ఆ ఘటనలో ఎవరైనా మండల వాసులు, వారి బంధువులు ఉంటే తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని మద్దిపాడు తహసీల్దార్ రజని, నాగులుప్పలపాడు తహసీల్దార్ జయలక్ష్మి తెలిపారు. మద్దిపాడు వాసులు 942270205 నంబర్‌ను, నాగులుప్పలపాడు వాసులు 88866 16038 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ హెల్ప్‌లైన్ నంబర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు.

స్వీట్ షాప్‌ల తనిఖీ



తనిఖీ చేస్తున్న రసూల్

మార్కాపురం టౌన్: పట్టణంలోని బేకరి, స్వీట్ షాప్‌లను శనివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని షాపుల్లో దుర్వాసన వస్తున్న పదార్థాలు, స్వీట్లను గుర్తించి సీజ్ చేయడంతోపాటు యజమానులను హెచ్చరించారు. నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలని, ట్రేడ్ లైసెన్స్ లేనివారు సచివాలయంలో శానిటరీ సెక్రటరీని సంప్రదించి తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జూట్ సంచులు వాడాలని సూచించారు.

వెలుగొండ క్షేత్రంలో శ్రీవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వెలుగొండ శ్రీవారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారిని అర్చకుడు ప్రసాదాచార్యులు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఏర్పాట్లను ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి పర్యవేక్షించారు. అలాగే వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు, అభయాంజనేయస్వామికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారిని అర్చకుడు విజయకాంత్‌శర్మ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పెన్షన్‌దారులు ఈకేవైసీ వేయాలి

తాళ్లూరు: పెన్షన్‌దారుల కోసం ఈకేవైసీ కౌంటర్లు ఆదివారం కూడా తెరిచి ఉంటాయని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆ సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి ఐ.వెంకటరెడ్డి, ఎస్.అంజిరెడ్డిలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

17 నుంచి సమ్మెలోకి పారిశుధ్య కార్మికులు

పొదిలి: నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఈ నెల 17 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ చెప్పారు. శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. రమేష్ మాట్లాడుతూ నగర పంచాయతీగా మారి 29 నెలలు గడిచినా కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ అందలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 17వ తేదీ నుంచి విధులు బహిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.సుబ్బయ్య, జి.నాగులు, కేవీ నరసింహం, బి.కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- గడిచిన ఏడు నెలల్లో మండల పరిధిలో 17,307 మందికి ఫ్యామిలి డాక్టర్ సేవలు



104 వాహనం వద్ద వైద్య సిబ్బంది

ఒంగోలు అర్బన్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే వైద్యం రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం..ఫ్యామిలీ డాక్టర్‌తో మరో మెట్టు పైకి ఎక్కింది. గత ప్రభుత్వంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ఆరకొర వైద్య సేవలు తప్ప మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేదు. గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య సమస్య వస్తే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించక తప్పేది కాదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య రంగంలో పెను మార్పులు సంభవించాయి. ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు నేరుగా ఇంటికే వెళ్లి రోగులను పరీక్షించే పరిస్థితి వచ్చింది. దీంతో గ్రామాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేల మందికి వైద్య సేవలు

ఒంగోలు మండలంలోని కరవది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మండలంలోని చేజర్ల, చింతాయగారిపాలెం, దసరాజుపల్లి, దేవరంపాడు, గుడిమెళ్లపాలెం, కరవది-2,మండువవారిపాలెం, సూరారెడ్డిపాలెం, ఉలిచి, వలేటివారిపాలెం, యరజర్ల గ్రామాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచి మండలంలో అన్ని గ్రామాల్లో కలిపి 17,307 మంది రోగులను పరీక్షించగా దానిలో 10,637 జనరల్ ఓపీలు ఉన్నాయి. ఇదే కాకుండా మండలంలోని 11 గ్రామాల్లో 11 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల్లో ఏఎన్‌ఎంల ద్వారా వైద్య సేవలు నిరంతరాయంగా అందుతున్నాయి. పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లను కేటాయించి వారిలో ఒకరు ఆస్పత్రిలో ఓపీ విధులు నిర్వహిస్తే మరొక డాక్టర్ ఫ్యామిలీ డాక్టర్ క్రింద ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఒంగోలు మండలంలో కరవది ప్రాథమిక ఆరోగ్యం కింద మండలంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ సచివాలయ పరిధిలో సంచార యూనిట్‌తో గ్రామీణులకు వైద్య సేవలు అందిస్తారు. అవసరమైతే ప్రజల ఇళ్లకే వెళ్లి ఆరోగ్య సేవలందిస్తారు. సంచార యూనిట్‌లో డాక్టర్‌తో పాటు ఎంఎల్‌హెచ్‌పీ (మిడిల్ లెవల్ హెల్త్ కేర్ ప్రొవైడర్), ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌లు ఉంటారు. ఈ సేవలు ప్రతి గ్రామం, సచివాలయ పరిధిలో నిర్దేశించిన రోజులో నెలకు రెండు పర్యాయాలు ఆరోగ్య సంచార యూనిట్ ద్వారా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్దేశిత ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తారు. ఉదయం ఓపీల అనంతరం మధ్యాహ్న సమయంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు పొంది ఇంటికి వచ్చిన వారిని నేరుగా వారి ఇంటి వద్దకే వెళ్లి పరిశీలించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న వారిని కూడా ఇంటి వద్దనే సందర్శించి ఆరోగ్య సేవలు అందిస్తున్నారు.

వైద్యులు ఇంటికే వస్తున్నారు



ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలేనికి చెందిన వెంకటేశ్వర్లుకు 60 ఏళ్లు. బీపీ, సుగర్‌తో బాధపడుతున్నారు. గతంలో ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండే పరిస్థితి. కానీ ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఇంటికే వస్తున్నారు. ఇంటి వద్దే డాక్టర్లు బీపీ, సుగర్ పరీక్షలు చేసి మందులిచ్చి వెళ్లారు. ఆరోగ్యం ఎలా ఉంది అడిగి మరీ తెలుసుకొని వెళుతున్నారు.

వైద్యుల సూచనలతో గాయం మానింది



సర్వేరెడ్డిపాలెంకు చెందిన వెంకయ్య 75 ఏళ్లు. దీర్ఘకాలంగా గాయంతో బాధపడుతున్నాడు. పెద్ద ఆస్పత్రులకు వెళ్లినా తగ్గలేదు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఇంటికి వచ్చి పరీక్షలు చేసి ఇంజక్షన్లు, ఆయింట్‌మెంట్లు ఇచ్చారు. ప్రతి నెలా వచ్చి పరీక్షలు చేసి ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ప్రస్తుతం గాయం మానింది.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే టీజేఆర్ ఆర్థికసాయం



సంధ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: ఇటీవల తీవ్ర రక్తస్రావంతో చికిత్స పొందుతూ మృతిచెందిన తేళ్ల సంధ్య కుటుంబానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం ఎస్సీకాలనీకి చెందిన గర్భిణీ స్త్రీ తేళ్ల సంధ్య ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సంధ్య కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థికసాయం, ఇద్దరు పిల్లలను చదివించేందుకు బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి గాయాలు

మద్దిపాడు: ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను ఒక టిప్పర్ ఢీకొనడంతో ట్రాక్టర్ ట్రాలీ రోడ్డుపై పడింది. ఆ ట్రాలీని అదేదారిలో వెళ్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున మద్దిపాడు మండలంలోని దొడ్డవరప్పాడు సమీపంలో జాతీయరహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... ఒంగోలు వైపు రాతి స్తంభాలు తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను ఒక టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఆ ట్రాక్టర్ ట్రాలీ రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఆ వెనుకే వచ్చిన కారు.. ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒంగోలు పవర్ ఆఫీస్ ఎదురుగా మాధవి హాస్పిటల్ నిర్వహిస్తున్న బాలసుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలయ్యాయి. అతని భార్య మాధవి, కారు డ్రైవర్ రామకృష్ణకు కూడా స్వల్ప గాయాలు కావడంతో వారిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన డాక్టర్ బ్యాంకాక్ టూర్ వెళ్లి తిరిగి హైదరాబాద్ వచ్చి కారులో ఒంగోలు వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు మాధవి తెలిపారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

ఒంగోలు సబర్బన్: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని ఏపీసీపీడీసీఎల్ ఒంగోలు ఈఈ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ముంగమూరు రోడ్డులోని బీఆర్ హోమ్ అపార్ట్‌మెంట్‌లో పర్యావరణంపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఈఈ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం-మిషన్ లైఫ్‌కు సంబంధించిన విద్యుత్ పొదుపు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. గృహాల్లో నిత్యం వినియోగించే విద్యుత్ ఉపకరణాల విషయంతో కొన్ని మెళుకువలు పాటిస్తే విద్యుత్ ఆదా చేయవచ్చన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కొన్ని సూచనలు చేశారన్నారు. విద్యుత్ పొదుపు, నీటి పొదుపు, ప్లాస్టిక్ నిషేధంతో పాటు అనేకరకాల సూచనలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సంతోష్‌కుమార్, ఎల్ఎం మోహన్, జూనియర్ ఇంజినీర్ షబ్బీర్, ప్రసాదు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

పొదిలి: పిచ్చికుక్కలు దాడి చేయడంతో ఇద్దరు గాయపడిన సంఘటన శనివారం తాలూకా ఆఫీసు వీధిలో చోటుచేసుకుంది. గుంపుగా వచ్చిన కుక్కలు వీధిలో ఆడుకుంటున్న బాలుడిపై దాడి చేశాయి. అనంతరం ఓ మహిళను వెంబడించి గాయపరిచాయి. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధికుక్కల బెడద తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కిమ్స్‌లో రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కిమ్స్ వైద్యులు

ఒంగోలు అర్బన్: గత పదేళ్ల నుంచి భుజం నొప్పితో బాధపడుతున్న 69 ఏళ్ల వెంకటసుబ్బమ్మకు రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ విజయవంతం చేసినట్లు కిమ్స్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.మనోజ్ తెలిపారు. హాస్పిటల్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వెంకటసుబ్బమ్మకు వైద్య పరీక్షల అనంతరం భుజం ఎముకలు పూర్తిగా అరిగిపోయినట్లు గుర్తించి రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ మేరకు గత నెల 31వ తేది విజయవంతంగా ఆపరేషన్ చేశామని, ప్రస్తుతం ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉందని తెలిపారు. ఫిజియోథెరపీ చేయించుకోవడం ద్వారా తన రోజువారీ పనుల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా సాధారణ జీవనం గడపవచ్చన్నారు. దీనిలో మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, ఉదయ్‌కుమార్, రామకృష్ణల వైద్యుల బృందం ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు.

రాయితీపై పండ్ల మొక్కల పంపిణీ

పొన్నలూరు: మండలంలో ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు నూరు శాతం రాయితీపై ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఏపీఓ మాచర్ల తెలిపారు. ఐదు ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు నిమ్మ, మామిడి, సపోటా, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ, జామ, గులాబి, మల్లె, సీతాఫలం, యాపిల్‌బేర్, దానిమ్మ, నేరేడు, మునగ వంటి పండ్ల మొక్కలను రాయితీపై అందజేస్తారన్నారు. రైతులు గ్రామాల్లోని ఉపాధి హామీ సిబ్బంది వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



వీల్‌బార్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదాం

- ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- చీమకుర్తి మున్సిపాలిటీలో సచివాలయానికి రెండు చొప్పున మొత్తం 16 వీల్‌బార్స్ అందజేత
- పారిశుధ్య కార్మికులకు హెల్త్‌కార్డుల పంపిణీ

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీని పరిశుభ్రంగా, సర్వాంగ సుందరంగా ఉంచేందుకు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది సహకరించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో తీసిన తడి చెత్త, వ్యర్థాలను రోడ్డుపై వేయకుండా బయటకు తీసుకెళ్లేందుకు కావాల్సిన వీల్‌బార్స్‌ను చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో శనివారం వారు ప్రారంభించారు. కాలువల్లో తీసిన తడి చెత్త, వ్యర్థాలను రోడ్డుపై వేయడం వలన రోడ్డుపై తిరిగే వాహనాలు తొక్కడం, దుర్వాసన రావడం జరుగుతుందని, ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. దానిని నివారించేందుకు వీల్‌బార్లు ఉపయోగపడతాయన్నారు. దాంతో పాటు ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తూ వాటి వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ.. క్లాత్‌లతో చేసిన కవర్ల వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన స్టిక్కర్లతో కూడిన వాల్‌పోస్టర్లను కూడా ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి చేతుల మీదుగా ఆవిష్కరించారు. 55 మంది పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐఎల్ హెల్త్ కార్డులు అందించారు. ఒక్కొక్కరు ఈఎస్ఐఎల్‌కు చెందిన ఆస్పత్రి, దానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రిలో రూ.10 లక్షల విలువైన వైద్యసేవలు పొందవచ్చని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అశోక్‌బాబు

నాగులుప్పలపాడు: పాలపర్తి మార్కు మాస్టారు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆరోగ్యశ్రీ ట్రస్టు రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ యాదల అశోక్‌బాబు అన్నారు. బాపట్ల విజయ హాస్పిటల్ వారిచే మట్టిగుంట గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజుతో కలిసి అశోక్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. శిబిరంలో చిన్నపిల్లలు, శస్త్ర చికిత్స నిపుణులు, సాధారణ వైద్యులు, స్త్రీ ప్రసూతికి చెందిన నిపుణుల ద్వారా మొత్తం 247 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినట్లు నిర్వాహకులు పాలపర్తి మనోజ్‌కుమార్ తెలిపారు. వైద్యులు పాలపర్తి వినోద్‌కుమార్, ప్రకాష్, మేరి ప్రశాంతి, పాలపర్తి మీనా పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఒంగోలు: స్థానిక రాంనగర్ పదో లైనులోని టార్గెట్ డ్రిల్ బేస్‌క్యాంపులో రమేష్ సంఘమిత్ర వైద్యులు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డెర్మటాలజీ విభాగం, చిన్న పిల్లల విభాగాల వైద్యులు డాక్టర్ పి.వీరభద్రయ్య, డాక్టర్ శ్యామసుందరి, డాక్టర్ దీపక్ సాహిత్యలు పాల్గొని చిన్నారులకు వ్యాధులు దరిచేరకుండా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. సాధారణంగా చర్మవ్యాధులు ఎలా వస్తాయి, ఒక వేళ వాటిని గుర్తించడం ఎలా, గుర్తించిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. టార్గెట్ డ్రిల్ బేస్ క్యాంపు డైరెక్టర్లు టి.ఝాన్సీ, టార్గెట్ డ్రిల్ బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ



దశరాజుపల్లె మందు సామాగ్రి తయారీ కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని దశరాజుపల్లె వద్ద ఉన్న టపాసుల మందుల తయారీ కేంద్రాన్ని, మామిడిపాలెం సమీపంలో గల కేంద్రాన్ని అధికారులు శనివారం పరిశీలించారు. ప్రమాదాలు జరుగకుండా తయారీ కేంద్ర నిర్వాహకులు తీసుకున్న చర్యలు, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు, రెవెన్యూపరంగా అనుమతులు తదితర విషయాలపై తనిఖీలో పరిశీలించారు. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, తహసీల్దార్ మురళి తాలూకా, సీఐ రాంబాబు, ఒంగోలు డివిజన్ ఫైర్ ఆఫీసర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి, సీఐ రాంబాబు మాట్లాడుతూ పటిష్టమైన భద్రతా, నాణ్యతలను పాటిస్తూ ఉండాలన్నారు. ఒంగోలు డివిజన్ ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లో సిగరెట్ తదితర ధూమపాన వస్తువులు వెలిగించరాదని సూచించారు. రాపిడి జరిగే ఎలాంటి పనిముట్లు వాడరాదని, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు నీరు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి మాట్లాడుతూ గ్రామానికి దూరంగా ఉత్పత్తులు తయారు చేయాలని, రవాణాలోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని మౌలిక సదుపాయాలు, ముందస్తు జాగ్రత్త చర్యలను పాటించాలని నిర్వాహకులకు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రికార్డులను అనుమతి పత్రాలను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట

అర్ధవీడు (కంభం): చింతమల్లెలపాడులో రాముల వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మనోజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ చెన్ను విజయమ్మ, ఎంపీటీసీ అనంతరావు, సర్పంచి హైమావతి, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే అన్నా శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధి అర్బన్ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ వై.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

నష్ట పరిహారంపై రైతులతో సమావేశం

పెద్దదోర్నాల: నేషనల్ హైవే భూసేకరణకు నష్ట పరిహారానికి సంబంధించి రైతులతో సబ్ కలెక్టర్ సేతు మాధవన్ శనివారం సమావేశమయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మండల కేంద్రానికి చెందిన రైతులతో పాటు చిన్నదోర్నాలకు చెందిన రైతులు హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలను అధికారులకు అందజేయాలని సబ్ కలెక్టర్ తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి భూమి విలువ ఆధారంగా నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. తహసీల్దార్ వేణుగోపాలరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా రైలు దుర్ఘటనపై హెల్ప్‌లైన్ ఏర్పాటు

మార్కాపురం: ఒడిశాలో ఘోర రైలు ప్రమాదానికి సంబంధించి మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ సేథు మాధవన్ తెలిపారు. ఈ ప్రమాదంలో మార్కాపురం ప్రాంత ప్రజలు ఎవరైనా ఉంటే వారికి సహాయ సహకారాలు అందించడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24 గంటలు అందుబాటులో ఉంటామని తెలిపారు. అవసరమైన వారు కంట్రోల్ రూమ్ నం.88866 16066ను సంప్రదించాలని సూచించారు.

ఆలయ భూములకు కౌలు ఆదాయం రూ.7.68 లక్షలు

తాళ్లూరు: బొద్దికూరపాడులో మాధవస్వామి, సోమేశ్వర స్వామి ఆలయ భూముల కౌలు సాగుకు శనివారం వేలం పాట నిర్వహించారు. మాధవ స్వామి దేవస్థానానికి సంబంధించి 46.47 ఎకరాలకు రూ. 4.13 లక్షలు, సోమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి 43.93 ఎకరాలకు రూ.3.55 లక్షలకు కౌలు పాటను రైతులు పాడుకున్నారు. ఈఓ భాస్కర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పులి అంజిరెడ్డి, సర్పంచి శ్యామ్సన్, ఉప సర్పంచి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధి కారక క్రిములను ఎదుర్కోవాలి

యర్రగొండపాలెం: వ్యాధి కారక క్రిములను ఎదుర్కొనేందుకు వైద్యశాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని షేర్ ఇండియా రాష్ట్ర అధికారి డాక్టర్ నీరద అన్నారు. శనివారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కరోనా, టీబీ, ల్యాబ్, డెలివరీ రూం, ఆపరేషన్ థియేటర్, వార్డ్ రూం, బయో మెడికల్ వేస్టేజ్‌లపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మైక్రో బయోలిస్ట్ డాక్టర్ సందీప్, టీబీ అధికారి డాక్టర్ సురేష్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.